క్లుప్తంగా

లక్ష్యం మేరకు పనులు



ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు పూర్తిచేయాలని, పనుల్లో అధిక మంది వేతనదారులు పాల్గొనేలా ఫీల్డు అసిస్టెంట్లు బాధ్యత వహించాలని పథక సంచాలకులు డి.కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఫీల్డ్ అసిసెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనికి తగ్గ వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

సీసీ కాలువల పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని శ్యాంపురం గ్రామంలో చేపడుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి నిధులతో శ్యాంపురంలో సీసీ రోడ్డు, కాలువ నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

పనుల పరిశీలన



మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

బాడంగి: మండలంలోని పిన్నవలస గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ గురువారం పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న సీసీ కాలువలు, రోడ్ల నిర్మాణాన్ని నాణ్యతాప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నభోజనం వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ భాస్కరరావు, ఎంఈఓ రాజేశ్వరి ఉన్నారు.

బాలకార్మికులను ప్రోత్సహిస్తే చర్యలు

బొబ్బిలి: దుకాణాలు, వివిధ పని ప్రదేశాల్లో బాలకార్మికులను పనిలో వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆపరేషన్ స్వేచ్ఛ నాలుగో విడతలో భాగంగా గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులకు విముక్తి కల్పించి పనులు చేయిస్తున్న యజమానులను ఏసీఎల్ పార్వతీపురం కోర్టు ఎదుట హాజరుపర్చారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గౌరీశంకర్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

బొబ్బిలి: గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం ఎదుట రామభద్రపురం మండలం రావివలస గ్రామస్తులతో కలసి గురువారం ధర్నా చేశారు. రావివలస పంచాయతీలోని పెద్ద చెలగాం రెవెన్యూ పరిధిలోని ఐదుగురు గిరిజన రైతులకు చెందిన 11.42 ఎకరాల భూమి హైవే నిర్మాణానికి వినియోగించినా రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. గిరిజనులతో పాటు సాగు చేస్తున్న వీఆర్‌ఏ టి.సింహాచలానికి చెందిన 2.30 ఎకరాలకు పరిహారం ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. భూములిచ్చిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రావివలస సర్పంచ్ సోమల కుమారి, సీపీఎం రామభద్రపురం మండల కన్వీనర్ బలస శ్రీనివాసరావు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా నిలుపుదల

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస, అంబేడ్కర్ కాలనీ, విద్యా నగర్, వరలక్ష్మీనగర్, మారుతీనగర్ ప్రాంతాలకు శుక్రవారం తాగునీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ వెంకట్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్డులో ప్రధాన పైపు లైన్ పాడైందని, మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.



గత ప్రభుత్వం నిర్మించిన ఎర్రవాని పార్కు

ఆహ్లాదం..ఎండమావి

- కానరాని పార్కుల నిర్వహణ
- మూలకుచేరిన పిల్లల ఆట సామగ్రి
- మళ్లీ పూర్వస్థితికి ఎర్రవాని చెరువు
- కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అధికారుల నిర్లక్ష్యం

రాజాం:

పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న రాజాం పట్టణంలో ఆహ్లాదం ఎండమావిగా మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో పట్టణంలో మౌలికవసతులు మెరుగుపరచడంతో పాటు పార్కులను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ కూడా చక్కగా చేశారు. అలాగే పట్టణం మధ్యలో ఉన్న చెరువును వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కుగా అభివృద్ధి చేసి పట్టణవాసులకు ఆహ్లాదాన్ని, వినోదాన్ని అందించే ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికా రంలోకి వచ్చిన తర్వాత పట్టణంలో పార్కుల నిర్వహణ అటకెక్కింది. పట్టణవాసులు ఉదయం, సాయంత్రం సమయాల్లో సేద



నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా తయారైన ఎర్రవాని పార్కు



చిల్డ్రన్ పార్కులో తుప్పపట్టిన ఆట పరికరాలు



వైఎస్సార్ పార్కు చెరువులో చెత్తాచెదారం

తీరే పార్కులు ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి.

రూ.1.03 కోట్లతో పార్కు ఏర్పాటు

పట్టణంలోని గాయత్రీకాలనీ రోడ్డులో ఉన్న ఎర్రవాని చెరువును పార్కుగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ద్వారా రూ.1.03 కోట్లు మంజూరు చేసింది. పూర్తిగా పూడుకుపోయిన చెరువును వుడా పర్యవేక్షణలో బాగుచేయించారు. ఆక్రమణలు తొలగించి, అందమైన పార్కుగా మలిచారు. లోపల పుట్‌పాత్ నిర్మాణంతో పాటు ఇరువైపులా మొక్కలు నాటారు. చెరువు అందంగా రూపు దిద్దుకుని పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడ నిర్వహణ పూర్తిగా కనుమరుగైంది. ఫలితంగా ఎర్రవాని చెరువు ఇప్పుడు కలుపుమొక్కలతో అస్తవ్యస్తంగా మారింది.

సారథి రోడ్డులో పార్కుదీ అదే పరిస్థితి

పట్టణంలోని సారథి రోడ్డులో ఉన్న వైఎస్సార్ పార్కును గత ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చింది. అంతకు ముందు టీడీపీ ప్రభుత్వంలో రాజాం మున్సిపాలిటీ అధికారులు రూ.60 లక్షల విలువైన జిమ్ పరికరాలు కొనుగోలుచేసి వాటిని పక్కన వదిలేస్తే... వాటిని గత ప్రభుత్వంలో వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వ్యాయామం నిమిత్తం యువకులు అధిక సంఖ్యలో పార్కుకు వచ్చేవారు. అలాగే ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టి, చుట్టూ కంచె వేశారు. చిన్నారులు, పెద్దలు ఇక్కడకు చేరి, ఆహ్లాదాన్ని, వినోదాన్ని పొందేవారు. మున్సిపల్ సిబ్బంది పహారా ఉండే వారు. ప్రస్తుతం పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది.

తుప్పపడుతున్న ఆట పరికరాలు

పట్టణంలో పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న చిల్డ్రన్ పార్కు పూర్తిగా పాడైంది. నిర్వహణను గాలికి వదిలేయడంతో పార్కు ముందు భాగం ఆక్రమణలకు గురవుతోంది. పార్కులో చిన్నారులకోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు పూర్తిగా తుప్పుపట్టి పాడవుతున్నాయి. గతంలో వీటికి మరమ్మతులు చేయించి, పార్కులో చెత్తాచెదారం లేకుండా మున్సిపల్ సిబ్బంది నిర్వహణ చేపట్టే వారు. ప్రస్తుతం ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ పార్కులోని పరికరాలు మొత్తం పాడయ్యాయి.

వినియోగంలోకి తెస్తాం

రాజాం పట్టణంలో పార్కుల ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం నిర్వహణకు నిధుల ఇబ్బంది ఉంది. త్వరలోనే వీటిని వినియోగంలోకి తీసుకొస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

– జె.రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, రాజాం.

పింఛన్ల తొలగింపునకు పన్నాగం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీలు అచ్చన్నాయుడు, జగన్‌మోహనరావు

రేగిడి: సామాజిక పింఛన్‌దారుల సంఖ్యను తగ్గించుకునేందుకు అక్రమాలు జరిగాయంటూ పింఛన్ల తొలగింపునకు ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు ఆరోపించారు. చిన్నశిర్లాం గ్రామంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయకక్ష సాధింపుల్లో భాగంగా పింఛన్లు తొలగిస్తామని కొందరు లబ్ధిదారులను కూటమి నేతలు భయపెడుతున్నారని ఆరోపించారు. అనర్హులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎటువంటి పింఛన్లు మంజూరు చేయలేదని, పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందించామని చెప్పారు. ఎలాంటి రాజకీయ ప్రలోభాలు లేకుండా గత ప్రభుత్వం పాలనచేస్తుంటే, ఈ ప్రభుత్వం మాత్రం పార్టీ రంగు అంటగట్టి లబ్ధిదారులను భయాందోళనలకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. 50 ఏళ్లు దాటిని వారికి పింఛన్ ఇస్తామని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని పక్కన పెట్టి, ఉన్న పింఛన్లు తీసేస్తామనడం ఏరు దాటిన తరువాత తెప్పను తగలేయడమేనని అన్నారు.

బార్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం సిటీ: రాజాంలో బార్ల లైసెన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది లైసెన్స్‌కు సంబంధించి ఈ నెల 22 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఔత్సాహికులు రూ.5 లక్షలు ఈ నెల 23వ తేదీలోగా డిపాజిట్ చేయాలన్నారు. డిపాజిట్ చేసిన మొత్తం వాపస్ ఇవ్వబడదని స్పష్టం చేశారు. లైసెన్స్ దక్కించుకున్న వారికి ఆగస్టు 2025 వరకు బార్ నిర్వహణకు అనుమతి ఉంటుందన్నారు. ఈ నెల 24న ఆన్‌లైన్‌లో బార్లు కేటాయిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

టార్పాలిన్ల పంపిణీ



రేగిడిలో రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రేగిడి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి కుప్పలు తడిచిపోకుండా కప్పేందుకు రైతులకు వ్యవసాయశాఖ టార్పాలిన్లు అందిస్తోందని ఏఓ జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని నాయిరాలవలస, వెంకమ్మపేట, తునివాడ, లచ్చారాయపురం తదితర గ్రామాల్లో రైతులకు గురువారం టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ప్రతీ రైతు సేవా కేంద్రానికి రెండు టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. వర్షాలకు పంట తడిచి పాడవ్వకుండా ఉండేందుకు రైతులకు వాటిని అందిస్తున్నామని, వర్షాలు తగ్గిన తర్వాత టార్పాలిన్లను తిరిగి రైతు సేవా కేంద్రాలకు అందించాల్సి ఉంటుందని చెప్పారు.

మొక్కుబడిగా గ్రామసభలు



కోడూరులో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలనాయుడు

బాడంగి: రైతుల భూ సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలు కేవలం మొక్కుబడి తంతుగా మారిపోతున్నాయని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కోడూరు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు భూ సమస్యల పరిష్కారంకోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. హెచ్‌డీటీ వద్ద ఫైల్స్ పెండింగ్‌లో ఉండిపోతున్నాయంటూ ఆరోపించారు. కోడూరులో 22ఏ కింద నమోదైన భూ సమస్యను పరిష్కరించాలని కోరారు. తహసీల్దార్ సుధాకర్ మాట్లాడుతూ సిబ్బంది కొరత కారణంగా అర్జీల పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని, రైతుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోగి జ్యోతి, మండల రీసర్వే డీటీ అప్పలనాయుడు, సర్వేయర్ వెంకటరమణ, వైస్ సర్పంచ్ రెడ్డికృష్ణ, ఎంఆర్ఐ జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలి



ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్

రేగిడి: ప్రత్యేక అవసరాల పిల్లలకు క్రమం తప్పకుండా రోజూ ఫిజియోతథెరపీ చేయిస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ బి.లక్ష్మీప్రసన్న గురువారం ఫిజియో థెరపీ చేశారు.ఈసందర్భంగా ఫిజియోథెరపిస్ట్ మాట్లాడుతూ క్రమ పద్ధతి లో ఫిజియోథెరపీ, వ్యాయామం చేయడం వల్ల ప్రత్యేక అవసరాల పిల్లలు త్వరగా కోలుకుంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, ఆర్.రాంబాబు, సీజీవీ వి.అనూ రాధ, సీఆర్‌పీ కె.చంద్రరావు పాల్గొన్నారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

రాజాం సిటీ: మున్సిపాలిటీతో పాటు మండలంలో ఖాళీగా ఉన్న, కొత్తగా మంజూరైన రేషన్ డిపోల డీలర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానిస్తున్నామని సీఎస్‌డీటీ ఎస్.చిరంజీవిరావు గురువారం తెలిపారు. మండలంలోని మారెడుబాక డీలర్‌పోస్టును (ఈడబ్ల్యూఎస్-మహిళ), రామినాయుడువలస (ఎస్టీ- జనరల్), మున్సిపాలిటీ పరిధిలోని గొల్లవీధి (బీసీ–ఈ), గాయత్రీకాలనీ (ఓసీ), బుచ్చెంపేట (బీసీ–డీ మహిళ), మల్లికార్జునకాలనీ డీలర్ పోస్టును ఓసీ–మహిళకి కేటాయించి నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18నుంచి 40 ఏళ్ల లోపు వారు, సంబంధిత రేషన్ డిపో పరిధిలో నివాసితులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల సచివాలయాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుదారులకు జనవరి 5న ఉదయం 11 గంటలకు చీపురుపల్లి జీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో రాతపరీక్ష ఉంటుందని తెలిపారు.

సంతకవిటి మండలంలో..

సంతకవిటి: మండలంలోని సిరిపురంలో-2, అప్పలాగ్రహారం, వాల్తేరు, మిర్తివలస గ్రామాల్లోని రేషన్ డిపోలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల పోస్టుల భర్తీకి చీపురుపల్లి ఆర్డీఓ నోటిఫికేషన్ విడుదల చేశారని తహసీల్దార్ బి.సత్యం గురువారం తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, జనవరి 5వ తేదీన ఉదయం 11 గంటలకు చీపురుపల్లి జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన

రామభద్రపురం: మండలంలోని రామభద్రపురం, తారాపురం రెవెన్యూ పరిధిలో డీసీసీబీకి, తారాపురం రైతులకు మధ్య వివాదాస్పదంగా మారిన రామభద్రపురం సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న భూమిని ఆర్డీఓ రామ్మోహనరావు గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సులోచనరాణి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు భూమికి సంబంధించిన హద్దులు, సర్వేనంబర్లు తదితర వివరాలను ఆర్డీఓకు తెలియజేశారు. ఇరువర్గాలను సమావేశపరిచి, పూర్తి దర్యాప్తు నివేదికను జేసీకి అందజేస్తానని ఆర్డీఓతెలిపారు.

నిరసన

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో ఉన్న బీసీ వసతి గృహాన్ని పట్టణానికి తరలించాలని డిమాండ్ చేస్తూ ఏపీ విద్యార్థి జేఏసీ కార్యవర్గ సభ్యులు గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా నిరసన తెలిపారు. బీసీ కళాశాల వసతి గృహం కోసం ఎన్ని మార్లు వినతులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బి.సాయికిరణ్, నందు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

వంగర: గంజాయి అక్రమ రవాణా, వినియోగం, విక్రయాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, కార్డులు, సీడీ ఫైల్స్, ప్రాపర్టీ గది, లాకప్‌లు,వివిధ కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు డైనమిక్ చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. మహిళా సంరక్షణ పోలీసులు, పోలీస్ సిబ్బంది వారికి అప్పగించిన దత్త త గ్రామాల్లో ప్రజలకు సైబర్ మోసాలు, డిజిటల్ అరెస్టు, మహిళలు, రహదారి భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, భూతగాదాలు, వివాదాలు జరగకుండా చూడాలని, పాత నేరస్తుల ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారుల సహకారం తీసుకోవాలన్నారు. 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా ప్రజలు, విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులను, స్టాపర్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎస్ఐ షేక్ శంకర్‌ను ఆదేశించారు. ఆయన వెంట రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏ.వి.లీలారావు ఉన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు



రేగిడి : చిన్నకోడిశ పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఇన్‌స్పెక్షన్ బృందం

రేగిడి: మండలంలోని చినకోడిశ, పెదకోడిశ గ్రామాల ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు, ఇన్‌స్పెక్షన్ బృంద సభ్యులు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రికార్డులు, వర్క్‌బుక్‌లు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. ఇన్‌స్పెక్షన్ బృంద సభ్యులు సీతంనాయుడు, శ్రీధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

రాజాం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. పట్టణంలోని కొండంపేట ప్రాథమిక పాఠశాలలో పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. విద్యార్థులతో కలసి సహపంక్తిభోజనం చేశారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై చర్చించారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం చంద్రినాయుడు, ఉపాధ్యాయులు హరిబాబు, సుజాత ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. రాజాం రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ పరిధిలో నమోదైన, దర్యాప్తులో ఉన్న, కోర్టు ట్రయల్‌లో ఉన్న కేసుల వివరాలను రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రను అడిగితెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు తీరుపై క్షుణ్ణంగా ఆరా తీయడంతోపాటు దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి హెచ్చరిక బోర్డులుతోపాటు రేడియం లైటింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట టౌన్ సీఐలు కె.అశోక్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఏ.వి.లీలారావు ఉన్నారు.

నిన్న రూ.50.. నేడు రూ.30



రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఉదయం కిలో పొట్టిచిక్కుడు రూ.50లు పలకగా, గురువారం ఉదయానికి రూ.30లకు పడిపోయింది. ఒక్కరోజులో కిలోకు రూ.20లు ధర తగ్గడంతో రైతులు గొగ్గోలు పెడుతున్నారు. మండలంలో సుమారు 200 నుంచి 300 ఎకరాల విస్తీర్ణంలో పొట్టి చిక్కుడు పంటను రైతులు సాగుచేశారు. ఫెంగల్ తుఫాన్ వర్షాలకు పాడైన పంటను అధిక పెట్టుబడులు పెట్టి సంరక్షించారు. దిగబడి వచ్చే సమయానికి ధర పతనం కావడంతో ఆవేదన చెందుతున్నారు.

– రామభద్రపురం

బాలయేసు రాక కోసం..



పల్లెల్లో క్రిస్మస్ సందడి నెలకుంది. పక్కి, కారాడ, అలజంగి తదితర గ్రామాల్లో గురువారం బాలయేసును వెతుకుతూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. బాలయేసు రాకకోసం ఎదురు చూస్తున్నట్టు ఆరాధకులు తెలిపారు.

– బొబ్బిలిరూరల్

క్షయపై అవగాహన అవసరం



క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా కందిశ, సరసనాపల్లి, జోడి బందల గ్రామాల ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులను నమలడంతో పాటు పీల్చడం ద్వారా టీబీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ కె.అప్పారావు మాట్లాడుతూ ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింట సర్వేచేసి, క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తక్షణమే పీహెచ్‌సీకి తీసుకురావాలని సూచించారు. వైద్య సిబ్బంది కె.హేమలత, పి.వి.జి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

– రేగిడి

సంక్షిప్తంగా...

స్వమిత్వ మ్యాపింగ్ పక్కాగా చేపట్టాలి

రాజాం సిటీ: గ్రామాల్లో స్వమిత్వ మ్యాపింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. రాజయ్యపేట సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించి స్వమిత్వ మ్యాపింగ్‌ను పరిశీలించారు. డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో కూడిన బృందం సర్వే చేసి మ్యాపింగ్ చేయాలని అన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు.

భూముల రీసర్వేకు సహకరించాలి

తెర్లాం: మండలంలోని పణుకువలస రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో జరగనున్న భూముల రీసర్వేకు ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ కోరారు. రీసర్వే తీరును గ్రామస్తులకు గురువారం వివరించారు. కార్యక్రమంలో పణుకువలస సర్పంచ్ చందక సత్యనారాయణ, డి.గదబవలస ఎంపీటీసీ వెంకట శేషగిరి, గోపాలవలస నాయకుడు గొందాల వెంకటరావు పాల్గొన్నారు. సోమిదవలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మిల్లులకు తరలించండి

వంగర: వరి నూర్పులు చేసిన రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రాజాం వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు సూచించారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని అరసాడ, నీలయ్యవలస తదితర గ్రామాల్లో గురువారం పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. వర్షాలకు కోత చేసిన వరి చేను తడిసిపోకుండా కుప్పలు పెట్టి టార్పాలిన్‌లు కప్పాలని, ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని చెప్పారు. ఆయన వెంట ఏఓ కన్నబాబు ఉన్నారు.

పిల్లలను పనికి పంపిస్తే చర్యలు

బొబ్బిలి: బడికి వెళ్లాల్సిన వయసులో పిల్లల్ని పనికి పంపిస్తే చర్యలు తీసుకంటామని సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలోని యానాదుల కుటుంబాలకు ఆయన గురువారం అవగాహన కల్పించారు. పిల్లల్ని బడికి పంపించి వారి భవిష్యత్తును బంగారుమయం చేయాలన్నారు. పనులకు పంపిస్తే దురలవాట్లకు బానిసై జీవితాలు నాశనమవుతాయన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

బొబ్బిలి: రెవెన్యూ సదస్సుల్లో రైతులు అందజేస్తున్న భూ సమస్యలను పరిష్కరిస్తామని ఆర్డీఓ జేవీవీఎస్ రామ్మోహనరావు తెలిపారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పాత బొబ్బిలిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇనాం భూముల బదలాయింపు, పేర్ల మార్పిడి తదితర అంశాలపై తహసీల్దార్, ఆర్డీఓ, జేసీ, కలెక్టర్ స్థాయిల్లో అనుమతులు ఇస్తామన్నారు. డివిజన్ పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 627 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 40 దరఖాస్తులు పరిష్కరించినట్టు చెప్పారు.